తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | మంగళవారం 17-02-2026 పేజీలు 8
/aksharagalam.com
సంపుటి : 13 సంచిక : 1 వెల : 3/-

## ఆమనగల్లులో ఒక్కటైన కాంగ్రెస్, బీజేపీ



3



### ఇక ఈ అవమానాన్ని
## భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే.

2

## హంగ్ మున్సిపాలిటీల్లో
# చక్రం తిప్పిన హస్తం

గందరగోళంగా మున్సిపల్ చైర్మన్ల ఎంపిక

- మెజార్టీ చైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం
- ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా
- ఎక్స్ అఫీషియో సభ్యులల బలంతో కాంగ్రెస్ పైచేయి
- ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్
- కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటన
- కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి
- కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

2

తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎన్నికలో తీవ్ర గందరగోళం నడిచింది. పలుచోట్ల ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక సీట్లు సాధించినా కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పలు మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాల్లో గందరగోళం వల్ల ఎన్నికను వాయిదా వేశారు. ఇకపోతే అధికార కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్లా ఆధిక్యం ప్రదర్శించింది. హంగ్ ఏర్పడిన చోట్ల పైచేయి సాధించింది. సిఎం రేంవత్ ఆదేశాలతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది.

## నేటినుంచి హైటెక్స్ వేదికగా
# బయో ఏషియా సదస్సు

- రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
- సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

**హైదరాబాద్:** ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా

మిగతా 2లో

## జనగామ మున్సిపల్
# ఎన్నికలో హైడ్రామా

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల పోటాపోటీ నినాదాలు
- హంగ్ ఏర్పడడంతో దక్కించుకునేందుకు ఎత్తులు
- కౌన్సిలర్ ఫాతిమా కిడ్నాప్ అంటూ ప్రచారం
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే పల్లా

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మున్సిపల్ పీఠాలను దక్కించుకునే క్రమంలో రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది.



**జనగామ:** మున్సిపల్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఆందోళనలు, కౌన్సిల్ హాల్‌లో సభ్యుల మధ్య నెలకొన్న గందరగోళం వల్ల సభ నియంత్రణలో లేదని, అందుకే ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. జనగామ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గానూ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. బీఆర్ఎస్ అత్యధిక సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికారం దక్కించుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ లేదు. కాంగ్రెస్

మిగతా 2లో



# కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

## అధికారులకు సిఎస్ ఆదేశాలు

కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది.

**హైదరాబాద్:** కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య,

మిగతా 2లో

## పట్టణాల్లో కాంగ్రెస్‌కు
# ప్రజల భారీ మద్దతు

- ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు
- రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి
- మధిరలో మీడియాతో డిప్యూటి సిఎం భట్టి

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.



**ఖమ్మం:** రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని

మిగతా 2లో



# కాంగ్రెస్ తీరు దుర్మార్గం

## మండిపడ్డ కేంద్రమంత్రి బండి

కరీంనగర్ పట్టణ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల తీర్పును పక్కనబెట్టి కాంగ్రెస్ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు.

**కరీంనగర్:** మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి బీజేపీకి మేయర్ పదవి రాకుండా అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ బలపడుతున్నందుకే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీకి మాటిచ్చానని, కరీంనగర్‌లో బీజేపీని గెలిపించి తన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఎప్పటికీ బీజేపీతోనే ఉంటారని, భవిష్యత్తులో కూడా పార్టీ విజయాలను కొనసాగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. బలం లేని చోట కూడా కాంగ్రెస్ కుట్రలకు

మిగతా 2లో



## తొర్రూరులో ఇరు వర్గాల
# బాహాబాహీ

- పరస్పర నినాదాలతో స్వల్ప ఉద్రిక్తత
- బిఆర్ఎస్ ఆధిక్యాన్ని దెబ్బతీసిన ఎక్స్ అఫీషియో
- ఎర్రబెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- రగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన ఎస్పీ

తెలంగాణలో మేయర్లు, డిప్యూటీ మేయర్‌లు, మున్సిపల్ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక పక్రియ కొనసాగుతున్న వేళ పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

2

# నిజామాబాద్ మేయర్ పీఠం దక్కించుకున్న కాంగ్రెస్

- ఎంఐఎం మద్దతుకు తోడు ఎక్స్ అఫీషియోల బలం
- మేయర్‌గా ఎన్నికైన ఉమారాణి



**నిజామాబాద్:** నిజామాబాద్ నగర మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై ఏర్పడిన ఉత్కంఠ ఎట్టకేలకు సోమవారం వీడింది. నిజామాబాద్ మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఆ నగర మేయర్‌గా ఉమారాణిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. నిజామాబాద్ నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో నగర ఓటరు బీజేపీకి 28, కాంగ్రెస్‌కు 17, ఎంఐఎంకు 14, బీఆర్ఎస్ పార్టీకు 1 కట్టబెట్టాడు. అయితే మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ.. మేయర్ పీఠం కోసం అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేపట్టింది. దాంతో ఎంఐఎంను తన దారికి తెచ్చుకొంది. దాంతో ఈ రెండు పార్టీలు కలిస్తే.. 31 సీట్లు వచ్చినట్లు అయింది. అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు కూడా కలిసి.. మరో రెండు ఓట్లు ఆ పార్టీకి వచ్చి చేరాయి. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఒక్క అభ్యర్థి సైతం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయాడు. దాంతో ఈ పీఠం సులువుగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. అదీకాక పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో.. నిజామాబాద్ నగర మేయర్ పీఠాన్ని ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాంతో ఆ పీఠం కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. బిజెపి మెజార్టీ సీట్లు సాధించిన ఫలితం దక్కలేదు. నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడంతో స్థానిక ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ధర్మపురి అర్వింద్ సోమవారం స్పందించారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్,

మిగతా 2లో



## అన్నిరంగాల్లో కృత్రిమ మేధ
# వినియోగం

- సానుకూల దిశగా ఆలోచిస్తేనూ మేలు
- దుర్వినియోగం చేస్తే దుష్ఫలితాలు తప్పవు
- కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి
- ఎఐ సదస్సుకు భారీగా భద్రతా ఏర్పాట్లు

అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు.

2



# కరీంనగర్‌పై బిజెపి జెండా

- మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక
- డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక
- బిజెపికి లాభించిన బిఆర్ఎస్ తటస్థ వైఖరి

తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది.

2

# హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

**హైదరాబాద్:** నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా వేసింది. హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం ఫలితాన్ని సాధించింది. ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెళిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్గా గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఇకపోతే హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదావేస్తున్న ట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీం పట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనేపేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపి, బీఆర్ఎస్ ల మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30గంటలు కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12.00 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇక ఈ అవమానాన్ని భరించలేను

**జగిత్యాల:** కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. 'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు.

## కరీంనగర్‌పై బిజెపి జెండా

**కరీంనగర్:** డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు.

# అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

**న్యూఢిల్లీ:** ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాల న్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని దిల్లీ వేదికగా 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది.20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. దిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.

# జనగామ మున్సిపల్ ఎన్నికలో హైడ్రామా

మొదటి పేజి తరువాయి



పార్టీ కూడా పీఠం దక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో, స్వతంత్ర అభ్యర్థులు ఇప్పుడు కింగ్ మేకర్లుగా మారారు. ఈ నేపథ్యంలోనే కౌన్సిలర్ల మద్దతు కూడగట్టే క్రమంలో తీవ్రస్థాయిలో రాజకీయ ఎత్తుగడలు మొదలయ్యాయి. ఎన్నికకు ముందు జనగామలో కిడ్నాప్ కథనాలు కలకలం రేపాయి. తమ కౌన్సిలర్లను ప్రత్యర్థి పార్టీలు కిడ్నాప్ చేశాయని ఒక వర్గం ఆరోపించగా, పోలీసుల ఒత్తిడితో అక్రమంగా కేసులు పెడుతున్నారని మరో వర్గం నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయం వెలుపల వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా గుమిగూడి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఎన్నిక వాయిదా పడటంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. తాము విజయం సాధిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను పోస్ట్‌పోన్ చేయించిందని మండిపడ్డారు. అధికారుల తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని, కలెక్టర్ , పోలీస్ విభాగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు. జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ హైడ్రామా నెలకొంది. 28వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ హఫీజ్ ఫాతిమాను మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కిడ్నాప్ అయ్యిందని, వారి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమెను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. విచారణ చేయాలంటూ ఫాతిమాను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు యత్నించారు. అయితే పోలీసులను జనగామ ఎమ్మెల్యే పల్లా అడ్డుకున్నారు. ఈ క్రమంలో డీసీపీతో వాగ్వాదానికి దిగారు. కాగా, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఫాతిమా స్పష్టం చేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచానని.. ఆ పార్టీకే మద్దతు ఇస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లిపోయారు. కాగా, జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఆపాలంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా హాజరైనా మిస్సింగ్ కేసు నమోదైందంటూ చామల వితండవాదం చేశారు. కోరం సభ్యులు అందరూ హాజరైనందుకు ఎన్నిక ఆపడం కుదరదంటూ అధికారులు చామలకు తేల్చిచెప్పారు. నిబంధనల ప్రకారం కోరం మొత్తం హాజరైన నేపథ్యంలో చైర్మెన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయలేమంటూ ప్రొసీడింగ్ అధికారులు తేల్చిచెప్పారు

# తొర్రూరులో ఇరు వర్గాల బాహాబాహీ

**మహబూబాబాద్:** స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నిక సజావుగా సాగుతోంది. కానీ హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకుపైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు, ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చినా ఎక్స్‌అఫిషియో మెంబర్ల ఓట్లతో బలాలు సమానం అయ్యాయి. దాంతో ఇక్కడ డ్రా తీసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు భారీ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. ఫలితంగా పరిస్థితి ఉద్రిక్తమై రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యాలయానికి చేరుకోగా.. ఎర్రబెల్లి పీఏపై కొంతమంది కాంగ్రెస్ కార్తకర్తలు దాడికి పాల్పడ్డారు. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్ మద్దతుదారులు కావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాలు సమానంగా మారాయి. దాంతో డ్రా ద్వారా ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదిలావుంటే వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆ పార్టీ చెబుతోంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తొర్రూరులో ఓటు హక్కు వినియోగించుకునేందకు రాగా.. అధికారులు అడ్డుకున్నారు. రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న ప్రాంతంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఆయనను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు వేసేందుకు అనుమతించ లేదు. దాంతో ఆయన ఈ అంశంపై కోర్టుకు వెళ్తానని చెప్పారు. దీంతో మున్సిపల్ చైర్మెన్ ఎన్నికల వేళ తొర్రూరులో హైటెన్షన్ నెలకొంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణుల వ్యతిరేక నినాదాలతో మున్సిపల్ ఆఫీసు ప్రాంగణం హోరెత్తుతోంది.భారీ జనసమీకరణకు ప్లాన్ చేసింది బీఆర్ఎస్. ఈ క్రమంలో మున్సిపల్ ఆఫీసు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఇరు వర్గాలు వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసులను సైతం తోసుకుంటూ మున్సిపల్ ఆఫీసు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి అదుపు తప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఎవ్వరు కూడా అక్కడ ఉండకుండా వెనక్కి పంపించారు. అక్కడే ఉంటే లాఠీ చేయాల్సి వస్తుందని కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలను హెచ్చరించారు. అలాగే అక్కడికి వచ్చిన యశశ్విని రెడ్డి అత్త ఝాన్సీరెడ్డిని కూడా ఎస్పీ వెన్నక్కి పంపించారు. ఆమె కారు దిగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మాత్రం మున్సిపల్ ఆఫీసుకు అనుమతించారు.



## మొదటి పేజి తరువాయి

### నేటినుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, అమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

### కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వి.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### కాంగ్రెస్ తీరు దుర్మార్గం

తెరలేపిందన్నారు. ప్రలోభాలతో కార్పోరేటర్లను వశపరచుకునే ప్రయత్నం చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నీతిమాలిన పనులను ఆయన తప్పుపట్టారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

### నిజామాబాద్ మేయర్ పీఠం దక్కించుకున్న కాంగ్రెస్

ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది.




తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

నిజం.. నిర్భయంగా

తెలంగాణ రౌండప్

మంగళవారం, 17 ఫిబ్రవరి 2026 పేజీలు 8


### నేడు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో

## కేసీఆర్ జన్మదిన వేడుకలు



అక్షర గళం, కుత్బుల్లాపూర్:

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత, కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా , మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం గండిమైసమ్మలోని ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమము, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడమైందని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సిబ్బంది తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## సన్నా వడ్లపై బోనస్

### మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా



ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం):

సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్వింటాల్ కు రూ.500 బోనస్ కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.514.36 కోట్లు విడుదల చేసిందని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్లో సన్నాలు అమ్మిన రైతుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ఈ బోనస్ అదనంగా లభించనుందన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందాన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం




### క్లబ్ పిఆర్ఓ పాషా

ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం):

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్స్ విజన్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ పిఆర్ఓ పాషా ప్రారంభించారు. లయన్స్ క్లబ్ కేంద్రంలో చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన శిబిరాల ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు కళ్ళను దానం చేసేలా అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామ్ రెడ్డి లయన్స్ విజన్ సెంటర్ కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ ఇస్లావత్ రాజేందర్లు 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 27 మంది కంటి ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి హాస్పిటల్ కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శిరీష, రాజేందర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.




## మదినగూడ డివిజన్ ను భవిష్యత్తులో సేవ చేసే అవకాశం ఇవ్వాలి

### మిద్దెల మల్లారెడ్డి

అక్షర గళం, మియాపూర్:

నిరంతరం ప్రజల క్షేమమే ధ్యేయంగా ముందుకెళుతూ మదినగూడ డివిజన్ ను భవిష్యత్తులో సేవ చేసే అవకాశం ఇస్తే గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యుత్తమ డివిజన్ గా తీర్చిదిద్దుతానని మిద్దెల మల్లారెడ్డి అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మదినగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటి కమిషనర్ శశిరేఖ కు వివరించారు .అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ మదినగూడ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో స్ప్రింగ్ వాల్యూ స్కూల్ ముందు ఉన్న డ్రైనేజ్ ని కల్వర్టుగా మార్చే విధంగా చూడాలని కోరారు. మైత్రి నగర్ ఫేజ్ 3 లో గల పార్క్ ను అభివృద్ధి చేయాలన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో సమన్వయపరిచి సమస్యను క్లియర్ చేసే విధంగా చూస్తానని తెలియజేశారు. భవిష్యత్తులో ప్రజలు మదీనాగూడ డివిజన్ కు సేవ చేసుకునే విధంగా దీవించి ముందుకు నడపాలని కోరారు.




## ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్

అక్షర గళం, మియాపూర్:

ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ డి.శశిరేఖ సంబందిత అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం లో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం లో వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు, డీసీ శశి రేఖ చెప్పడం జరిగింది.ఇంజనీరింగ్లో 1, యుబీబి 1, ఎంటామాలజీ1, శానిటేన్ 1 మొత్తం 4 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం, ఎఎంపీ విజయ్ కుమార్ , టీపీఎస్ రమేష్, డీఈ వశిధర్, ఎఎంఓహెచ్. శ్రీకాంత్ రెడ్డి,ఎస్ఎస్ శ్రీనివాస్, ఇంజనీర్ సెక్షన్ ప్రశాంత్, బాలగౌడ్, వెటర్నరి విబాగం గీత, యుబిడి సెక్షన్ సతీష్ బాబు, యూసీడి, సెక్షన్ వీణ, శివ శంకర్ రెడ్డితదితరులు, ప్రజావాణి కార్యక్రమం లో పాల్గొన్నారు

# ఆమనగల్లులో ఒక్కటైన కాంగ్రెస్, బీజేపీ

### కాంగ్రెస్ లో చేరి చైర్మన్ పదవి దక్కించుకున్నా పత్య నాయక్

### పత్య నాయక్ కాంగ్రెస్ చేరడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ శ్రేణులు

### పత్య నాయక్ కు సంబందించిన హాస్పిటల్లో అద్దాలు, ఫర్నిచర్ వస్తువులు ధ్వంసం

### పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (అక్షర గళం):

ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎన్నిక ఆసక్తిగా మారింది. బిఆర్ఎస్ పార్టీతో గెలిచిన అభ్యర్థి చివరి అంకంలో కాంగ్రెస్లో చేరి చైర్మన్ పదవి దక్కించుకున్నాడు. ఫిబ్రవరి 11న జరిగిన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నేనావత్ పత్యనాయక్ విజయం సాధించారు. బిఆర్ఎస్ పార్టీ స్పష్టమైన మ్యాజిక్ ఫిగర్ ఎనిమిది స్థానాలను గెలుచుకొని చైర్మన్ పదవికి పాపిశెట్టి రాము పేరును గులాబీ పార్టీ ప్రతిపాదించింది. తర్వాత జరిగిన రాజకీయ సమీకరణలు బిజెపి, అధికార కాంగ్రెస్ పార్టీ జట్టు కట్టి బిఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పత్య నాయక్ కాంగ్రెస్ కండువా కప్పుకుని మధ్యాహ్నం జరిగిన చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసి గెలుపొందారు. దీంతో ఉదయం కారులో ఉన్న పత్య నాయక్ కాంగ్రెస్ లో చేరి చైర్మన్ గా ఎన్నికయ్యారు.

**అమనగల్లు చైర్మన్ గా పత్యానాయక్ ప్రమాణం**

అమనగల్లు మున్సిపల్ ఛైర్మన్ గా పత్యానాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో భారీ భద్రతల మధ్య ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులందరి చేత ప్రమాణం చేయించిన అనంతరం ఛైర్మన్ పత్యానాయక్ తో అధికారులు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టారు.

**ఆమనగల్లులో ఉద్రిక్తత**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 8 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించిన నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరిన పత్య నాయక్ పై పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు.

**పత్యానాయక్ హాస్పిటల్ పై దాడి**

బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన పత్యానాయక్ కాంగ్రెస్ పార్టీ లో చేరిన సందర్బంగా బిఆర్ఎస్ నాయకులు అతని ప్రవైట్ హాస్పిటల్ పై దాడి చేసినట్లు సమాచారం.హాస్పిటల్లో అద్దాలు ధ్వంసం చేయగా, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

**పత్యానాయక్ హాస్పిటల్ ను పరిశీలించిన ఎమ్మెల్యే**

ఆమనగల్లు మున్సిపాలిటీలో ఘటనల నేపథ్యంలో పత్యానాయక్ హాస్పిటల్ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి పత్య నాయక్ తో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకుని తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి శాంతి భద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు.

## ఘనంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్



అక్షరగళం, కుత్బుల్లాపూర్:

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుప్పాల ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 46 చురుకైన , ఉత్సాహభరితమైన జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డాయి. ఈ కార్యక్రమం యువతలో ఐక్యత, ఆరోగ్యం, క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది.టోర్నమెంట్ చివర్లో విజేత జట్టుకు రూ.20,000 నగదు బహుమతి మరియు ట్రోఫీ, అలాగే రన్నర్ జట్టుకు రూ.10,000 నగదు బహుమతి మరియు ట్రోఫీలను జిహెచ్ఎంసి డివిజన్ ప్రెసిడెంట్ శ్రీ పుప్పాల భాస్కర్ గారి చేతుల మీదుగా అందజేశారు. ఆయన హాజరు మరియు సహకారం ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రసాద్ నాయుడు, అరుణ్, యల్లేష్ మరియు ముకేష్ మాట్లాడుతూ, పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకు, స్వచ్ఛంద సేవకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, ఇలాంటి సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిర్వహించేందుకు సహకరించిన జంకిరాములు గారు, పాల కృష్ణ గారు, పోల్ శ్రీకాంత్ గారు, నేటి రాజు గారు, కోల శ్రీకాంత్ గారు, తాటి రవి గారు, ముకుంద్ రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.






## మున్సిపల్ కార్పొరేషన్ల చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ల ఎన్నిక

అక్షర గళం, మేడ్చల్:

మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ లను ఎన్నిక చేసారు. ఆలియాబాద్ మున్సిపాలిటీ చైర్పర్సన్గా కంటం శిరీష అలియాస్ కంటం శ్వేత (కాంగ్రెస్), వైస్ ఛైర్మన్గా కన్ రెడ్డి మాలతి (బిజెపి ) ఎన్నికైన వారితో ప్రత్యేక అధికారి జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి హరిష్ బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ గా జామురవి (బిఆర్ఎస్), వైస్ ఛైర్మన్ గా మొరుగుబాయి శశిరేఖ (బిఆర్ఎస్) ఎన్నికైన వారితో ప్రత్యేక అధికారి జిల్లా కోఆపరరేటివ్ అధికారి నాగలింగ చారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎల్లంపేట మున్సిపాలిటి ఛైర్ పర్సన్ గా లావుడ్య శ్రీదేవి(బిఆర్ఎస్), వైస్ ఛైర్మన్ గా మేకల రజిత (బిజెపి) ఎన్నికైన వారితో ప్రత్యేక అధికారి జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీర్ చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు.









# ప్రతి ఒక్కరూ భక్తి భావాలతో మెలగాలి

## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి ఫిబ్రవరి 16 (అక్షర గళం ):**

ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవర్చుకోవాలని దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు కల్వకుర్తి మండల పరిధిలోని వెంకటాపూర్ జీడిపల్లి గ్రామాలలో శ్రీ శ్రీ పెద్ద బండ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి ని దర్శనం చేసుకున్న అనంతరం మాట్లాడుతూ స్వామివారి స్వామివారి ఆశీస్సులు పరిసర గ్రామాల ప్రజలందరిపై ఎల్లప్పుడూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామానికి వచ్చిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ని శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జీడిపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ జీడిపల్లి తండా సర్పంచ్, భీమ్లా నాయక్ వెంకటాపూర్ ఉపసర్పంచ్ ఇఫ్తారీ స్థానిక నాయకులు జైపాల్ రెడ్డి ఐలెన్ సంతోష్ మల్లేష్ రవీంద్రా నాయక్ చందు హరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.





# కల్వకుర్తి పట్టణ అభివృద్ధి కృషి చేయాలి

## మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం





**కల్వకుర్తి ఫిబ్రవరి 16 (అక్షర గళం ):**

కల్వకుర్తి పట్టణ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని ఆయా వార్డుల ప్రజల నమ్మకాన్ని చూరగోనాలని కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం అన్నారు సోమవారం నూతనంగా కౌన్సిలర్లుగా ఎన్నికైన 19వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షాహిద్ 14వ వార్డు కౌన్సిలర్ బావండ్ల మంజుల మధు 3వ వార్డు కౌన్సిలర్ కేతావత్ రాములను శాల్వాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పదవీకాలంలో పట్టణ అభివృద్ధిలో తమ వంతు కృషి చేయాలని సూచనలు సలహాలు చేశారు. బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని చూసి గెలిపించిన వార్డు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తాం

## హైదర్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

**అక్షరగళం, శేరిలింగంపల్లి:**

నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని హైదర్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని బృందావన్ కాలని లో చేపట్టవలసిన, పెండింగ్ లో ఉన్న సేవరేజ్ పైప్ లైన్ పనులను, అలానే చేపట్ట వలసిన పలు అభివృధి పనులను జలమండలి సిబ్బంది, జిహెచ్ఎంసి వీధి దీపాల సిబ్బంది, కాలనీ వాసులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ వారి విజ్ఞప్తి మేరకు జలమండలి అధికారులతో పర్యటించి పాత సెవరేజ్ లైన్ను మార్చి నూతన సెవరేజ్ పునర్నించాలని కోరగా, జలమండలి అధికారులతో కలసి చర్చించి, పరిష్కారం చూపి, పనులను వెంటనే మొదలు పెట్టాలని అధికారులకు చెప్పడం జరిగింది అలానే పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మరియు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట, నార్నె




శ్రీనివాసరావు గారు తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని నార్నె శ్రీనివాసరావు చెప్పడం జరిగినది, అలానే అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, అదే విధంగా హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సూపర్వైజర్ నరేంద్ర వారి సిబ్బంది, వీధి దీపాల ఇంచార్జి సుధాకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం

**అక్షరగళం, మేడ్చల్:**

మేడ్చల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అలియాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం సాధించింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అలియాబాద్ మున్సిపాలిటీ ఇంచార్జిగా వ్యవహరించగా గెలుపొందిన కౌన్సిలర్లకు, అలాగే చైర్మన్గా ఎన్నికైన కంటం శిరీష కృష్ణ రెడ్డి కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైసిగారి శ్రీనివాస్, కొలన్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# నూతన కౌన్సిలర్ గా పసుల లలిత ప్రమాణ స్వీకారం

**కల్వకుర్తి ఫిబ్రవరి 16 (అక్షర గళం):**

కల్వకుర్తి 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్గా గెలుపొందిన పసుల లలిత సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో కౌన్సిలర్ గా ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శాలువాలతో సత్కరించి అభినందనలు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు వర్షపాకుల శేఖర్ తదితరులు ఉన్నారు.

## ప్రయాణికుల 'బరువు మోత'కు

# ఆర్టీసీ పరిష్కార యత్నం

### ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు

### ప్రయాణికుల స్పందన ఆధారంగా మిగతా

### వాటిల్లో బిగించాలని నిర్ణయం

**హైదరాబాద్:** జిల్లా సర్వీసుల్లో బస్సెక్కగానే ప్రయాణికులు వారి వెంట తెచ్చుకున్న బ్యాగులను బస్ అటక(ర్యాక్స్) మీద పెట్టేస్తారు... ఆ బరువు మోసే అవసరం వారికి ఉండదు. కానీ, హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఆ వసతి లేదు. దీంతో ప్రయాణికులు బరువు ఎంతున్నా, బ్యాగులను మోస్తూ నిలబడాల్సిందే. ఈ విషయంలో పాఠశాల విద్యార్థులు ఎక్కువగా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో చాలా మంది ఈ విషయంలో ఆర్టీసీ పరిష్కారం చూపాలని కోరినా, బస్సుల్లో ఉండే రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ దానిని పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన ఆర్టీసీ, సిటీ బస్సుల్లో కూడా సామగ్రి పెట్టుకునే అటకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు...**

జిల్లా సర్వీసుల్లాగా ఆర్టీసీ సిటీ బస్సుల్లో ఎక్కువసేపు ప్రయాణించే పరిస్థితి ఉండదు. కానీ, ప్రయాణించే సమయం తక్కువే అయినా, ఎక్కువ బరువుతో ప్రయాణించేవారు లగేజీ పెట్టుకునే స్థలం లేక మోస్తూ నిలబడాల్సి వస్తోంది. సిటీ బస్సుల్లో ఎక్కువ సమయం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ఆ సమయంలో నిలబడేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రయాణికులు వారి బ్యాగులను కింద పెట్టే వీలు కూడా ఉండదు. తప్పని పరిస్థితిలో మోస్తూ ఉండాల్సిందే. పాఠశాల విద్యార్థులు భారీ బ్యాగులను మోస్తూ, రద్దీ మధ్యలో మెసలడం.. వారికి, తోటి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సుల్లో ప్రయోగాత్మకంగా లగేజీ అటకలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. తొలుత రెండు బస్సుల్లో ఏర్పాటు చేసి పరిశీలించింది. ప్రయాణికుల అభిప్రాయాన్ని తెలుసుకోవాలన్న ఉద్దేశంతో తొలిదశలో 150 బస్సుల్లో అటకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా సర్వీసుల్లో ఉండేంత విశాలంగా కాకుండా, తక్కువ ఎత్తుతో ఉండేలా వాటిని ఏర్పాటు చేస్తున్నారు.



**ఒక్కో బస్సుకు రూ.15 వేలు...**

ఆర్టీసీకి ప్రత్యేకంగా మియాపూర్లో బస్‌బాడీ నిర్మాణ విభా గం ఉంది. సొంతంగా సిబ్బందే బస్సు బాడీలను తయారు చేసే సామర్థ్యం ఉన్న వారు కావటంతో, ఈ పనిని కూడా వారికే అప్పగించారు. ఇందుకు ఒక్కో బస్సుకు రూ.15 వేల ఖర్చు అవుతుందని తేల్చారు. ప్రస్తుతం ఆ బస్సుల్లో అట కలు ఏర్పాటు చేసే పని జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో ఆ బస్సులు అటకలతో తిరగనున్నాయి. అవి ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉన్నాయా, సిటీ రద్దీ నేపథ్యంలో అవి అంతగా వినియోగించుకునే పరిస్థితి ఉందా లేదా అన్నది గుర్తించి... మిగతా బస్సుల్లో వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారు. రద్దీ ఉన్నప్పుడు ప్రయాణికులు ఒకచోట కాకుండా అటూ ఇటూ మారుతుంటారు. అలాంటప్పుడు ఈ ర్యాక్స్‌ను వినియోగించుకోవటం అనుకూలంగా ఉంటుందా లేదా అన్నది పరిశీలించనున్నారు.

**అప్పట్లో పార్టీషన్ పేరుతో వృథా వ్యయం...**

ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత హైదరాబాద్ సిటీ బస్సుల్లో మహిళా ప్రయాణికులు--పురుష ప్రయాణికులు కలిసిఉండే వీలు లేకుండా ప్రత్యేక పార్టీషన్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఓ వరుస సీట్లను తొలగించి మధ్యలో ఇనుప జాలీ తరహాలో స్లైడింగ్ డోర్‌తో కూడిన విభజనను ఏర్పాటు చేశారు. ఇందుకు ఏకంగా రూ.4.5 కోట్లు ఖర్చు చేశారు. అప్పట్లో ఓ ఉన్నతాధికారి వీటి ఏర్పాటులో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. కొద్ది రోజులకే ఆ ఏర్పాటు వృథా ప్రయాస అని తేలిపోయింది. మళ్లీ వాటిని తీసేసి, వాటి కోసం తొలగించిన సీట్లను తిరిగి ఏర్పాటు చేశారు. వాటితో పోలిస్తే, తాజా నిర్ణయం ఉపయోగకరమైంది, తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావటంతో దీనికి సానుకూలత ఉంటుందని ఆర్టీసీ భావిస్తోంది.

## పాలనలో మెరుగైన సేవలే లక్ష్యం

**అమరావతి:** మానవజీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని చెప్పారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివృద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన సంగతి తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు.

## పత్యేక విమనాంలో గన్నవరం చేరుకున్న గేట్స్

**అమరావతి:** గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌తోపాటు ఆయన ప్రతినిధి బృందం సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు పొగ మంచు కారణంగా దాదాపు 15 నిమిషాలపాటు.. బిల్స్ గేట్స్ ప్రతినిధుల బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఏటీసీ అనుమతి ఇవ్వడంతో గన్నవరం ఎయిర్ పోర్టులో విమానం ల్యాండ్ అయింది. ఇక బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతోపాటు స్వాగతం పలికిన మంత్రులు, అధికారుల బృందం వెలగపూడిలోని సచివాలయానికి ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరారు. సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి స్వాగతం పలకనున్నారు. అనంతరం బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతో వారంతా సమావేశం కానున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు విస్తరించే అంశంపై వీరంతా చర్చించనున్నారు. ఆ తర్వాత ఆర్టీజీఎస్ కేంద్రానికి చేరుకుని.. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని బిల్ గేట్స్ ప్రతినిధి బృందం పరిశీలించనుంది. రియల్ టైమ్ గవర్నెన్స్ విధి విధానాలు, ఫలితాలను ఈ సందర్భంగా బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించనున్నారు. అలాగే గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఇందులో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై సీఎం ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టులను బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరిస్తారు. బిల్ గేట్స్‌కు చెందిన గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్ట్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఉండవల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో బిల్ గేట్స్ బృందం పర్యటించనుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగు విధానాన్ని ఈ బృందం పరిశీలించనుంది. ఈ బృందం వెంట సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులు, అధికారులు ఉండనున్నారు.

## బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

**అమరావతి** గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

## చంద్రబాబుతో బిల్‌గేట్స్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

**అమరావతి:**గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నామనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్ట ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే..

# అక్రమాల దూకుడు... అధికారులు మౌనం

### మూసివేతల మాటలు... పనుల పరుగు

### డీసీ పర్యవేక్షణ ఎక్కడ? నోడల్ అధికారి చర్యలు ఎక్కడ?

### 26 ఫిర్యాదులు... వైఫల్యానికి అద్దం



కూకట్ పల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా విస్తరిస్తుండటంతో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం పనితీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారా? అన్న ప్రశ్నలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. "మూసివేతలు", "నోటీసులు", "చర్యలు" అంటూ ప్రకటనలు వెలువడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక రోజు మూసివేసినట్లు ప్రకటించిన భవనాల్లో మరుసటి రోజే పనులు జోరుగా సాగుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యత ఎవరిది సర్కిల్ పరిధిలో చట్ట అమలుకు డిప్యూటీ కమిషనర్ ప్రధాన పర్యవేక్షకుడు. అక్రమాలపై తుది నిర్ణయాలు తీసుకునే అధికార స్థాయి ఇదే. అయినప్పటికీ నిర్మాణాలు ఆగకపోతే పర్యవేక్షణలో లోపం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేకంగా నియమితుడైన నోడల్ అధికారి ఫిర్యాదులపై సమన్వయం చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఫలితాలు కనిపించకపోవడం పర్యవేక్షణ వ్యవస్థ పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తోంది .క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన టౌన్ ప్లానింగ్ సహాయ కమిషనర్ మరియు రోజువారీ పర్యవేక్షణ బాధ్యత కలిగిన టౌన్ ప్లానింగ్ పర్యవేక్షకుడు పాత్రలపైనా ప్రశ్నలు తలెతు తున్నాయి. మూసివేసిన భవనాల్లోనే మళ్లీ పనులు మొదలవుతుంటే అమలు యంత్రాంగం బలహీన పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రజావాణిలో 26 ఫిర్యాదులు**

ఇటీవల సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కేవలం టౌన్ ప్లానింగ్ విభాగంపైనే 26 ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఒకే విభాగంపై ఇంత పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నదని స్థానికులు అంటున్నారు. సమస్యలు పరిష్కారమవుతున్నాయంటే ఫిర్యాదులు తగ్గాలి గానీ, పెరుగుతుండటం వ్యవస్థలో లోపాలున్నాయనే సంకేతమని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

**కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో పరిస్థితి ఆందోళనకరం**

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ ప్రాంతంలో నివాస మండలంలో వాణిజ్య నిర్మాణాలు విస్తరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రహదారి రద్దీ, వాహన నిలిపివేత సమస్యలు, మురుగునీటి వ్యవస్థపై ఒత్తిడి వంటి ఇబ్బందులతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. బయట మూసివేత ప్రకటనలు కనిపిస్తుండగా, లోపల నిర్మాణ పనులు కొనసాగుతుండటం ప్రజల్లో అనుమానాలను మరింత బల పరు స్తోంది. ఉన్నతాధికారుల జోక్యం అవసరం కేవలం ప్రకటనలు కాకుండా క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను పూర్తిగా నిలిప వేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యతల బదిలీ కాకుండా స్పష్టమైన జవాబు దారీతనం ఉండాలని, అవసరమైతే బాధ్యులపై పారదర్శక విచారణ జరపాలని కోరు తున్నారు. అలా కాకపోతే ప్రజా ఆందోళనలు మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## జేఈఈ మెయిన్స్ 2026 సెషన్-1 పరీక్షలలో శ్రీ వశిష్ట విద్యాసంస్థల ప్రభంజనం........






### జేఈఈ మెయిన్స్ మరోసారి తన సత్తా చాటిన శ్రీ వశిష్ట విద్యాసంస్థలు......

**శేర్లింగంపల్లి:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన జేఈఈ మెయిన్స్ 2026 సెషన్-1 పరీక్షలలో శ్రీ వశిష్ట విద్యాసంస్థలలో ఎటువంటి ఐఐటి ఫౌండేషన్ లేకుండా వచ్చిన సాధారణ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్ పర్సన్ శ్రీమతి లింగమనేని ప్రమీల రాణి గారు మాట్లాడుతూ.... రెండు తెలుగు రాష్ట్రాలలో జేజుజు ాంఉఖుఅఎవంం కి 63% సక్సెస్ రేట్ తో అర్హత సాధించి శ్రీ వశిష్ట అత్యుత్తమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు అందిన ఫలితాలలో శ్రీ వశిష్ట విద్యార్థులు చల్ల సాయి వెంకట ఆదిత్య (99.80% tile, కట్టా హితేష్ (99.77% , సి బి జయంత్ (99.69 tile), ధ్రువంతేజ్ (99.14, రిషి కీర్తన్ రెడ్డి (99.12% 99 పర్సంటైల్ పైగా సాధించారని తెలియజేశారు. పటిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, అనుభవం మరియు అంకిత భావం గల అధ్యాపకుల బోధన, అధ్యాపకేతర సిబ్బంది నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల నిర్విరామ కృషి వలన ఈ విజయాలు సాధ్యమయ్యాయి అన్నారు. శ్రీ వశిష్ట విద్యాసంస్థలను నమ్మి విద్యార్థులను చేర్చిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి తరగతిలో తక్కువ మంది విద్యార్థులు ఉండడం వలన ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం సాధ్యం అయిందని, దీనితో పాటు అధ్యాపకులు క్లాస్ అనంతరం వారికి ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేయడం వలన, అలానే ఏ రోజు జరిగిన పాఠ్యాంశాలు ఆ రోజే విద్యార్థి పూర్తి చేసుకునే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. రెట్టింపైన ఉత్సాహంతో చూీూ నిర్వహించే JEE MAINS Session-2, JEE ADVANCED, NEET మరియు ఇతర పరీక్షలలో కూడా తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బిల్గేట్స్ పర్యటనతో ఎపిక పెరిగిన ప్రాధాన్యత

### ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**అనకాపల్లి, :** మహాశివరాత్రిని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో పవిత్ర ఉత్తర వాహిని తీరానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి జాగరణ చేసిన భక్తులంతా సోమవారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు వరాహనది ఉత్తర వాహిని తీరానికి భారీగా విచ్చేశారు. అనంతరం వారంతా బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పుణ్య స్నానాలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అన్నవరం సత్యనారాయణ స్వామి దేవ స్థానం వద్ద అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అయ్యన్నపాత్రుడు, ఆయన సతీ మణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి స్వయంగా పాల్గొని భక్తులకు అల్పా హారాన్ని వడ్డించారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది.

## విశాఖ బీచ్‌లో విషాదం

**విశాఖపట్టణం:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మదిలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వెళ్లారు. రేడిసన్ బ్లూ రిసార్ట్ వెనుక ఉన్న సముద్రతీరంలో ఐదుగురు స్నానానికి దిగారు. వీరిలో పి.అరవింద్ కృష్ణ (21) అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. గమనించిన అతని స్నేహితుడు రాజీవ్.. అరవింద్‌కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. స్పందించిన బ్లూ బీచ్ లైఫ్ గార్డ్ సిబ్బందితోపాటు బోటింగ్ యాజమాన్యం ఇద్దరినీ రక్షించి ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌కృష్ణను అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరవింద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి స్వస్థలం రాజమండ్రి. రాజీవ్ అనే విద్యార్థి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అహోబిలంలో నేడు కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం

**నంద్యాల:** ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 17వ తేదీన మంగళవారం నాడు దర్శనాలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు దర్శనాలు ఉండవని భక్తులు గమనించాలని కోరారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేస్తున్నట్లు తెలిపారు.

# జగిత్యాలలో కుదిరిన సయోధ్య

**జగిత్యాల):** తాజా.. మాజీ ఎమ్మెల్యేల మధ్య అధిపత్య పోరు నెలకొన్న వేళ.. జగిత్యాల మున్సిపాలిటీ పీఠంపై సస్పెన్స్ వీడింది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ వర్గానికే పార్టీ అధిష్ఠానం కేటాయించింది. ఇరువర్గాలతో సీఎం రేవంత్ మాట్లాడి సయోధ్య కుదిర్చినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే వర్గానికి ఛైర్‌పర్సన్ పీఠం దక్కింది. దాంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆయన వర్గానికి చెందిన సమిండ్ల వాణిని ఎంపిక చేశారు. అలాగే వైస్ చైర్మన్ పదవి మాజీమంత్రి జీవన్ రెడ్డి వర్గానికి కేటాయి ంచింది. దీంతో వైస్ చైర్మన్ పదవికి పర్వీన్‌ను ఎన్నుకున్నారు. మరోవైపు జెడ్పీ, మార్కెట్ కమిటీ పదవులను జీవన్‌రెడ్డి వర్గానికి కేటాయిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తాము సైతం కష్ట పడ్డామంటూ జీవన రెడ్డితోపాటు ఆయన వర్గం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు జీవన్ రెడ్డి వర్గానికి వైస్ చైర్మన్ పదవిని కేటాయించారు. దీంతో ఇరువర్గాలు ప్రస్తుతానికి శాంతించినట్లు ఒక

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

### డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి

### అంతర్జాతీయ నిపుణుల వెల్లడి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థితి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉప సంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖ రుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# గజేంద్ర 'మోక్షం'

'ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపలనుండు లీనమై' అనే పోతన గారి పద్యం సుప్రసిద్ధం. ఇప్పటి సంగతేమో కానీ, ఇటీవలి వరకూ ఈ పద్యం విననివారు ఉండరు. దాని వెనక కథేమిటంటే, ఓ ఏనుగు మడుగులోకి దిగింది. ఓ మొసలి దాని కాలు పట్టు కుంది. విడిపించుకోడానికి ఏనుగు హోరాహోరీ పోరాడింది. ఆ పోరాటం ఏళ్ళ తరబడి సాగింది. ప్రాణం కడతేరే దశలో ఏనుగు ఈశ్వరునికి మొర పెట్టుకుంది. ఆ క్రమంలో ఏకంగా విశ్వమూలాల్లోకి వెళ్ళిపోయింది; ఈ జగత్తు ఎవరివల్ల పుట్టిందో, ఎవరిలో ఉంటుందో, ఎవరిలో లయమైపోతుందో, పరమేశ్వరుడెవరో, అనాది మధ్య లయుడెవరో, అంతా తనే అయిన వాడెవరో-- అతని నుంచి పుట్టిన ఈశ్వరుని శరణువేడుకుంటు న్నానంటుంది. అప్పుడు ఈశ్వరుడు వచ్చి మొసలిని చంపి ఏనుగును రక్షిస్తాడు! ఈ క్షణాన ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఏనుగులు ఇలాగే మొరపెట్టుకుంటున్నాయి; ఈసారి అక్కడి అటవీ గ్రామాల వాళ్ళు కూడా ఆ మొరలో గొంతు కలుపుతున్నారు. మనుషులకీ, ఏనుగులకీ మధ్య అక్కడ పతాక స్థాయిలో జీవన సమరం జరుగుతోంది. ఉభయులనూ రక్షించగల ఈశ్వరుడే కనుచూపు మేరలో కానరావడం లేదు. గత పన్నెండేళ్ళలోనే 68 ఏనుగులతోపాటు, 698 మంది మనుషులు మరణించారు. కొద్దిరోజుల క్రితమే ఓ 70 ఏళ్ళ వృద్ధుని ఏనుగులు తొక్కి చంపేశాయి. భారత వన్యప్రాణి సంస్థవారూ, జంతు సంక్షేమ సంఘం వారూ రంగంలోకి దిగి చేస్తున్న రోదనలు అక్షరాలా అరణ్యరోదనే అయినట్టు కనిపిస్తున్నాయి. మరీ క్రూర జంతువులను మినహాయిస్తే, ఏనుగులు సహా వన్యప్రాణులతో మనిషి సహజీవనం చేయని దశ చరిత్రలో కనిపించదు. ఇప్పుడు సహజీవనం చేయలేని దశకు చేరుకున్నాడు. అందుకు తనే బాధ్యుడు తప్ప వన్యప్రాణులు కావు. ఈ భూమండలం మీద జీవించే హక్కు అన్ని ప్రాణులకూ ఉన్న సంగతి మరచిపోయి తన సర్వం సహాధిప త్యాన్ని స్థాపించుకోడానికి పూనుకున్నాడు. అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా అడవుల్ని నరికేసి జనావాసాలను సృష్టిస్తున్నాడు, గనులు తవ్వేస్తున్నాడు, అడవుల్లో ఎక్కడబడితే అక్కడ విద్యుత్తంత్రులను వేలాడదీస్తున్నాడు. దాంతో వన్యప్రాణులకు సంచార భూమి కుదించుకుపోయి ఊళ్ళమీద పడుతున్నాయి. ఇటీవలి వరకూ ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఏనుగుల సంఖ్య నామమాత్రం. ఇప్పుడు మూడు వంతుల మేరకు, అంటే దాదాపు 400కు వాటి సంఖ్య పెరిగిపోయింది. అభివృద్ధి పేరిట జరుగుతున్న తవ్వకాల వల్ల అలవాటుపడిన దారులు మరచిపోయి అవి జనావాసాల్లోకి వచ్చిపడుతున్నాయి. 90 శాతం ఏనుగుల మరణానికి విద్యుదాఘాతాలే కారణమంటున్నారు. ఆ పైన గోతులు, బురద నేలలు వాటి ప్రాణాలు హరిస్తున్నాయి. అడవి జంతువులను మచ్చిక చేసుకుని వాడుకోవడంలో ఎంతో తెలివి కనబరచిన మనిషి, చివరికి వాటితోనే పోరాడి ప్రాణాల మీదికి తెచ్చుకునే తెలివి హీనతకు దిగజారడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వార్థం వికటించి ప్రకృతి విధించిన అన్ని రకాల హద్దులనూ, సహజీవన ధర్మాన్నీ ఉల్లంఘించడమే అందుకు కారణం. పురాణ, ఇతిహాస కాలంతో మొదలుపెట్టి, చరిత్ర కాలం వరకూ మనిషికీ, ఏనుగుకీ ఉన్న అనుబంధం అనేక రూపాల్లో అక్షరబద్ధమైంది. ఏనుగు ముఖంతో ఉన్న గణపతిని కొలవడం సరేసరి; 'ఏనుగు మీద రాముడు, ఎంతో చక్కని దేవు'డని పిల్లలు పాడుకోవడం మనకు తెలుసు. ధర్మరాజు వాకిట్లో ఏనుగుల నుంచి స్రవించే మదం బురద కట్టగా, కిక్కిరిసిన సామంత రాజులు ధరించిన ఆభరణాల నుంచి జారిన రజం ఆ బురదను కప్పేసిందంటూ ధర్మరాజు గజ సంపదనూ, సామంత రాజుల బలగాన్నీ కూడా -- 'ఎవ్వాని వాకిట నిభమద పంకంబు రాజభూషణ రజోరాజి నడగు' అనే పద్యంలో అద్భుతంగా వర్ణిస్తాడు తిక్కన. యుద్ధంలో ఓడిన తర్వాత, ఏనుగునెక్కి, రెండు వైపులా అనేక ఏనుగులు వెంట రాగా పురవీథుల్లో ఎలా విహరించగలవంటూ, చక్కని మరో తిక్కన పద్యంలో అర్జునుడు దుర్యోధనుని ఆక్షేపిస్తాడు. 'ఏనుగునెక్కినాము ధరణీంద్రులు మొక్కగ నిక్కినాము' అంటూ తిరుపతి వెంకటకవులు సగర్వంగా చెప్పుకుంటారు. ఏనుగునెక్కి యుద్ధాలు చేసిన మనిషి ఏనుగుతో యుద్ధం చేయవలసి రావడమే అతని వివేక భ్రష్టతకు పరాకాష్ఠ. ఛత్తీస్‌గఢ్ అడవులు ఘోషిస్తున్న సత్యం అదే!

---

## చిరంజీవి భుజానికి సర్జరీ

**హైదరాబాద్:** అగ్ర కథానాయకుడు చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా చిరు పోస్ట్ పెట్టారు. తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చేతికి పట్టీ ఉండటం గమనించి పలువురు శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ-హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను బాగానే కోలుకుంటున్నా. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ఆయన నైపుణ్యంతో ఆ ప్రక్రియ అంతా సజావుగా, సౌకర్యవంతంగా సాగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా చిరంజీవి వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు శిరీష్ వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను చిరంజీవికి అందించారు. అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ స్వయంగా చిరు ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలతో పాటు వివాహ ఆహ్వాన పత్రికను అందించి పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి చేతికి కట్టు ఉండటం గమనించి పలువురు అభిమానులు ఆందోళన చెందారు. ఆయనకు ఏమైందంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో చిరంజీవి స్వయంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు.

## ఎఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

### ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు.

## శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

### విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం

### ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

## జెఇఇ మెయిన్ ఫలితాల విడుదల

### వందశాతంతో సత్తా చాటిన ముగ్గరు తెలుగు విద్యార్థులు

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) పేపర్-1 ఫలితాలు వచ్చేశాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒక విద్యార్థి 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశంలో ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలను తర్వాత ప్రకటించ నున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 మంది (96.26?) హాజరయ్యారు. ఈ ఫలితాల్లో మొత్తంగా 12మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణ నుంచి వివాన్ శరద్ మహేశ్వరి ఉన్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

## అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

**న్యూఢిల్లీ,** అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి

# ఛాందసవాదులకు చావుదెబ్బ

తరాలు మారినంత మాత్రాన గాయాలు తొలగిపోవు. నెత్తుటి చరిత్రను అంత సులభంగా చెరిపేయడం సాధ్యపడదు. బంగ్లాదేశ్ తాజా ఎన్నికల ఫలితాలు దీన్నే బలంగా చాటుతున్నాయి. బంగ్లాదేశ్‌లో అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ, అణచివేతకూ వ్యతిరేకంగా ఉద్యమించిన జెన్--జీ తరాన్ని అడ్డుపెట్టుకుని దేశాన్ని ఛాందసవాదం ఊబిలోకి నెట్టాలని, యాభై అయిదేళ్ల క్రితం బంగ్లా ప్రజానీకాన్ని ఊచకోత కోసిన పాక్‌తో అంట కాగాలని తహతహలాడిన మతతత్వ శక్తులు గురువారం నాటి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలయ్యాయి. ఫలితాలు ఇంకా అధికారికంగా వెలువడాల్సే ఉన్నా 300 స్థానాలున్న పార్లమెంటులో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) ఆధ్వర్యంలోని కూటమి 216 స్థానాలు గెల్చుకుందని వార్తలు వస్తున్నాయి. జమాతే ఇస్లామీ నేతృత్వంలోని కూటమికి 76 స్థానాలు లభించాయి. ఇంకా కౌంటింగ్ కొనసాగుతున్న చాలా స్థానాల్లో బీఎన్‌పీ కూటమి ఆధిక్యతలో ఉన్నదని సమాచారం. పెద్ద మనిషిలా కనబడే ఆర్థిక నిపుణుడు మహ్మద్ యూనస్‌ను తాత్కాలిక ప్రభుత్వా నికి ప్రధాన సలహాదారుగా నియమిస్తే, ఆయన కాస్తా మతోన్మాదాన్ని రెచ్చగొట్టడమే ధ్యేయమన్నట్టు ప్రవర్తించారు. మైనారిటీ హిందూ పౌరులపైనా, అవామీ లీగ్ నేతల పైనా, ఆ పార్టీ అనుబంధ సంఘాల నేతలపైనా ఉన్మాద గుంపులు దాడులు చేస్తుంటే, హతమారుస్తుంటే పట్టనట్టు ప్రవర్తించారు. మతాచారాలు పాటించటం లేదంటూ నడి రోడ్లపై మహిళలను హింసిస్తుంటే కళ్లు మూసుకున్నారు. వాటిని అతిగా చిత్రిస్తున్నారని మీడియాపై విరుచుకుపడ్డారు. హసీనా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన వారిని చేరదీసి, నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ)ని ఏర్పాటు చేయించిందీ, జమాతేతో సర్దుబాటు చేయించిందీ ఆయనే. దేశంలో కొత్త పొద్దు పొడవబోతోందని గురువారం నాటి యూనస్ హుషారు మాటల అర్థం వేరు. జమాతే, ఎన్‌సీపీ మెజారిటీ స్థానాలు సాధిస్తాయని ఆయన విశ్వసించారు. అవామీ లీగ్‌పై ఎటూ నిషేధం ఉంది. బీఎన్‌పీ గత చరిత్ర సైతం అవినీతిమయమే. కనుక రెండు పార్టీల కథ ముగిసినట్టేనని అంచనా కొచ్చారు. కానీ బంగ్లా ప్రజలు వివేకవంతమైన తీర్పునిచ్చి ఆయనకూ, ఆ బాపతు శక్తు లకూ చెంప ఛెళ్లుమనిపించారు. దేశంలో సుస్థిరమైన, స్వతంత్రమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడాలని జనం కోరుకుంటున్నట్టు రాజకీయ నిపుణులు ముందే చెప్పారు. అయితే ఎన్నికలతోపాటు రాజ్యాంగ సంస్కరణలపై నిర్వహించిన రిఫరెండమ్ విషయంలో ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా ఉండక తప్పదు. వాటిల్లో అవాంఛనీయమైన అంశాలు చొరబడే ప్రమాదం లేకపోలేదు. చూడటానికి వాటి సారాంశం మెరుగ్గానే ఉంది. ప్రధాని పదవికి రెండు దఫాల పరిమితి, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళలకూ, యువతకూ పటిష్టమైన ప్రాధాన్యత, పార్లమెంటుకు రెండు సభల ఏర్పాటు అందులో ఉన్నాయి. ఈ సంస్కరణల అమలు బాధ్యత జనం బీఎన్‌పీకి కట్టబెట్టారు. భావోద్వేగాలతో ముడిపడే ఎన్నికలతో, ఎంతో ఆలోచించి ఓటేయాల్సిన రిఫరెండమ్‌ను జత చేయటం సరికాదు. పైగా బీఎన్‌పీ గత చరిత్ర ఘనమైనదేమీ కాదు. కాబోయే ప్రధాని తారిఖ్ రెహ్మాన్ తల్లి ఖలీదా జియా రెండు దఫాల ఏలుబడిలో మతతత్వ, భారత వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహాన్నందించారు. ఇప్పటికైతే రెహ్మాన్ ఆలోచనా ధోరణి భిన్నంగా ఉన్నట్టు ఆయన ప్రసంగాలు చెబుతున్నాయి. బంగ్లా విముక్తి యుద్ధానికి కొత్త భాష్యాలు చెప్పినవారికీ, పాక్ పాలకులను నెత్తినెక్కించుకున్నవారికీ ఈ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. నిషేధంలోవున్న అవామీలీగ్ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో పోటీచేయలేదన్న మాటేగానీ, ఆనాటి పాక్ దుష్కృత్యాలను ప్రజానీకానికి గుర్తుచేయటంలో విజయం సాధించారు. హసీనా అవినీతి పాలన పుణ్యమా అని జెన్--జీ తరానికి దేశ చరిత్ర గురించి తెలియకుండా పోయింది. భారత్ అనుకూలతకు దూరంగా ఉండాలని, హసీనాను వెనక్కి రప్పించే యత్నం చేయాలని, నీటి వాటాలపై రాజీ పడొద్దని రెహ్మాన్‌పై జమాతే పార్టీ ఒత్తిళ్లు తెస్తుంది. వ్యర్థ వివాదా లతో కాలక్షేపం చేయకుండా, నిజాయితీగా పాలిస్తే రెహ్మాన్ రాజకీయంగా నిలదొక్కుకుంటారు. లేనట్టయితే ఇప్పుడు ఓటమిపాలైన శక్తులు ముమ్ముందు

## న్యాయవాది జి. స్వప్న కుమారి హత్య కేసు

**హైదరాబాద్:** చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాద ఘటనలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యను నివారించడంలో మొయినాబాద్ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై, డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదు పరిగణనలోకి తీసుకుంది. మృతురాలు తన సోదరుడిని నిందితుడిగా పేర్కొంటూ తన ప్రాణాలకు ముప్పు ఉందని ముందుగా పోలీసులకు హెచ్చరించినప్పటికీ, పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఇది విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించాల్సిన విషయమని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నుండి సమగ్ర నివేదిక కోరుతూ, కేసును తదుపరి పరిశీలన కోసం మార్చి6కు వాయిదా వేశారు.

## 18న మీడియా అకాడమిలో

**హైదరాబాద్:** భూ హక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ రిపోర్టింగ్ పై ఒక్క రోజు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. నెల 18వ తేదీన ఉదయం 9-00 గంటల నుండి సాయంత్రం 5-00 గంటల వరకు నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భూ చట్టాలు- భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం-అనుబంధ రంగాలలో ప్రభుత్వ స్కీములు, బ్యాంకు రుణాలు, పర్యావరణ భద్రత, చెరువులను కాపాడుకోవడం, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా-చట్టాలు, డిజిటల్ రిపోర్టింగ్, వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాలు, రెవెన్యూ అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడంతోపాటు రిపోర్టింగ్ లో పర్యావరణ, సాంకేతిక అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా రంగం వేగంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, సమాజానికి నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన ప్రతిభను మరింత పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

## 26న నెల్లూరు మేయర్ ఎన్నిక

**అమరావతి:** నెల్లూరు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరు మేయర్ విషయంలో అన్యాయం జరుగుతోందంటూ మాజీ మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ ఆందోళనలు చేపట్టారు. అయితే జయవర్ధన్ ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించారు. వైసీపీ ప్రోత్సాహంతోనే తమపై విషప్రచారం సాగించారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశాన్ని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ ప్రచారాలు చేశారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో తమకేసంఖ్యా బలం అత్యధికంగా ఉందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. కాగా, నెల్లూరు మేయర్ పదవికి దేవరకొండ శ్రీలతని టీడీపీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

## సిఎం చంద్రబాబుతో తుమ్మల భేటీ

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో సమావేశం అయ్యారు. ఈభేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా పునర్విభజనలో ఆంధ్రాలో కలిసిన 5 గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. తిరుమలలో తెలంగాణకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం చంద్రబాబుని తుమ్మల కోరారు. ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మం జిల్లా పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85శాతం నిధులను విడుదల చేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి, అమరావతి రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించారు. భద్రాచలం ముంపు బారిన పడకుండా నిర్మించిన కరకట్టకి సంబంధించి.. ఏపీలో కలిసిన భాగానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంత్రి తుమ్మల కోరారు.

## టిడ్కో గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఒంగోలు:** ఉగాది నాటికి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అప్పగిస్తామని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరి మున్సిపాలిటీ చాకిరాల సమీపంలో నిర్మాణంలో ఉన్న 912 టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో తెదేపా హయాంలో 60 శాతానికి పైగా టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి లబ్ధిదారులను మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తిరిగి గృహాలకు నిధులు మంజూరు చేసి రాష్ట్ర వ్యాప్తంగా పనులను చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట తెదేపా నాయకులు షరీఫ్, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు ప్రధాని మోడీతో ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంబయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.

## 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మరో 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. 17 బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. ఒక స్థానంలో భాజపా విజయం సాధించింది. మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాల సమయానికి 90 స్థానాల్లో వివిధ పార్టీలు స్పష్టమైన మెజార్టీ కనబరచగా.. 36 స్థానాల్లో హంగ్ పరిస్థితి ఏర్పడింది. కాగా, వివిధ పార్టీల మధ్య పొత్తులు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కొన్ని మున్సిపాలిటీ

# వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు

### 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నం

### సుప్రీంలో తెలంగాణ వాదనలు



**న్యూఢిల్లీ:** గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఏపీ ప్రయత్నిస్తోందని సుప్రీంకోర్టులో తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ నిర్మిస్తున్న పోలవరం -నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరఫున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటాయించిన 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నిస్తోందన్నారు. వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 200 టీఎంసీలు తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఏపీ తరపున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. అయితే ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు' అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీం కోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద సులభ్ కాంప్లెక్స్

**హైదరాబాద్:** హైదరాబాదు నాంపల్లి ఎగ్జిబిషన్ మెహబూబియా గేట్ వద్ద ఉద్యాన సంచాలకులు శ్రీమతి. షేక్ యాస్మిన్ భాష, డీలక్స్ సులబ్ కాంప్లెక్స్ ని ప్రారంభించారు. దీనిని సిఎస్ఆర్ పథకం ద్వారా 36 లక్షల నిధులతో ఆరేసి ఫౌండేషన్ లిమిటెడ్, హర్యానా మరియు ఉద్యానవన శాఖ వారు నిర్మించడం జరిగింది. దీనిని పురుషులు, మహిళలు మరియు వికలాంగులందరూ కూడా వినియోగించు కొని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ శ్రీమతి ఐ. రామలక్ష్మి గారు, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ శ్రీమతి సంగీత లక్ష్మి గారు, అదే విధంగా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి హేమలత గారు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సర్పంచ్‌ల్తో నేడు కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం

**జనగామ:** దమ్ముంటే జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సవాలు విసిరారు. అప్పుడే కేసీఆర్ పాలన బాగుందో, రేవంత్ పాలన బాగుందో తేలిపోతుందని స్పష్టం చేశారు. జనగామలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పెంబర్తి నుంచి జనగామ చౌరస్తా మీదుగా సూర్యాపేట రోడ్డులోని భ్రమరాంబ కన్వెన్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో కేటీఆర్ ఆత్మీయ సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏర్పాట్లను సోమవారం నాడు ఎర్రబెల్లి దయాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 50 శాతానికిపైగా సర్పంచ్‌లను గెలుచుకున్నామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల డైవర్షన్ కోసమే కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్నారని ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు.

## వెనెజువెలాపై అమెరికా బలప్రయోగం

**బీజింగ్:** వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయని అగ్రరాజ్యంపై మండిపడింది. ప్రపంచ పోలీస్ లేదా అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించేందుకు ఏ దేశానికీ అధికారం లేదని పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బల ప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. ఏ దేశమైనా ప్రపంచ పోలీసు పాత్రను పోషించలేదు. అంతర్జాతీయ న్యాయమూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షించాలి. అన్నిదేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది. అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.

## బంగ్లాలో ఆగని హిందువుల హత్య

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై హత్యాకాండలు ఆగడం లేదు. సోమవారం సాయంత్రం 5ప్రాంతంలో అందరూ చూస్తుండగానే మరో హిందూ యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మృతిచెందగా, దుండగులు పరారయ్యారు. బంగ్లాదేశ్‌లోని జస్సోర్ జిల్లా కేశబ్పూర్ ఉపజిల్లా వార్డు నెంబర్-17లోని కొపలియా బజార్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మృతుని కేశబ్రూర్ ఉపజిల్లాలోని అరువా గ్రామానికి చెందిన రాణాప్రతాప్ (45)గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, మార్కెట్‌కు వచ్చిన రాణాప్రతాప్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలిసిన మణిరాంపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఆఫీసర్ ఇన్‌చార్జి రజివుల్లా ఖాన్ తెలిపారు. కొద్దికాలంగా దేశవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలు, ఉద్రిక్రతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తరహా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గత మూడు వారాల్లో ఇది ఐదవది.

## సాహితీ ఇన్‌ఫ్రాటెక్ మోసం 3వేల కోట్లు

**హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ పేరిట భారీ మోసానికి పాల్పడ్డ సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు నాలుగేళ్ల విచారణ అనంతరం మొత్తం రూ. 3000 కోట్ల రూపాయల స్కామ్‌గా దీనిని తేల్చారు. ప్రీ లాంచ్ ఆఫర్' పేరుతో అతి తక్కువ ధరకు ఎ÷-లాట్లు, ఎ÷-లాట్లు ఇస్తామంటూ వేలాది మంది కష్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారు సాహితీ యాజమాన్యం. ఈ కేసులో మొత్తం 64 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా అమీన్‌పూర్‌లోని శర్వాణి ఎలైట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి 17 కేసులు ఉన్నాయి. ఈ 17 కేసుల్లో రూ. 500 కోట్లు పైగా వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కంపెనీ యాజమాన్యంలోని సాహితీ లక్ష్మీనారాయణ వసూలు చేసిన డబ్బులను సొంత ప్రయోజనాలకు ఉపయోగించారని ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 13 మంది నిందితులపై అభియోగాలు నమోదు చేసిన టీం, పలు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ స్కాం వల్ల వేలాది మంది మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయి. బాధితులు గతంలో ధర్నాలు, నిరసనలు చేశారు. పోలీసుల విచారణ కొనసాగుతోంది. మిగతా కేసుల్లోనూ త్వరలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని అధికారులు తెలిపారు.

## పరకామణిపై హైకోర్టుకు టిటిడి నివేదిక

**అమరావతి:** తిరుమల శ్రీవారి పరకామణిలో వెంటనే చేపట్టనున్న సంస్కరణల నివేదికను పరిశీలించిన తరవాతనే ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణిలో వెంటనే చేపట్టాల్సిన సంస్కరణలపై ఏపీ హైకోర్టుకు టీటీడీ సోమవారం నివేదిక అందజేసింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక ఈ పరకామణి వ్యవహారంలో కేసుల నమోదు విషయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించి రావాలని సీఐడీ, ఏసీబీ డీజీలను హైకోర్టు ఆదేశించింది. శ్రీవారి పరకామణిలో హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టనున్న సంస్కరణలపై హైకోర్టుకు టీటీడీ నివేదిక అందజేసింది. ఈ కేసు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# పెరూ షామన్ల జ్యోతిష్యం నిజమయ్యిందా

### వెనెజువెలా దాడి గురించి ముందే చెప్పిన షామన్లు

### ఇప్పుడు సర్వత్రా ఇదే అంశంపై చర్చ

**పెరూ:** వెనెజువెలాపై అమెరికా మెరుపు దాడులు, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోని అదుపులోకి తీసుకున్న అంశం ప్రపంచాన్ని షేక్ చేస్తోంది. రాత్రికి రాత్రే జరిగిన ఈ పరిణామంతో యావత్ ప్రపంచం షాక్ అయ్యింది. అయితే, ఈ ఆపరేషన్ గురించి ముందుగానే చెప్పారు పెరూలోని షామన్లు. అవును, ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసిన ఈ అంశాన్ని ఘటనకు కొన్ని రోజుల ముందే చెప్పారు. కానీ, ప్రపంచమే పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు అది నిజమవడంతో షామన్ల ప్రిడిక్షన్‌పై పెద్ద చర్చ నడుస్తోంది. డిసెంబర్ 29వ తేదీన షామన్ల బృందం పెరూ రాజధాని లిమాలోని సముద్రం ఒడ్డున ఒక వార్షిక ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు రాబోయే సంవత్సరానికి సంబంధించి జోష్యం (ప్రిడిక్షన్) చెబుతారు. సాంప్రదాయ ఆండియన్ పోంచోలు, శిరస్త్రాణాలు ధరించి.. అంతర్జాతీయ సంబంధాల గమనం, కొనసాగుతున్న సంఘర్షణలు, ప్రపంచ దేశాల నాయకుల విధిని అంచనా వేస్తుంటారు. ఈ క్రమంలోనే.. వెనెజువెలా నాయకుడు మదురో భవిష్యత్‌ను కూడా షామన్లు చెప్పారు. మదురోను పదవి నుంచి తొలగిస్తారని.. ఆయనను తొలగించడంలో ట్రంప్ కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మదురోను పదవి నుంచి తొలగిస్తాడని ముందే గ్రహించాము. ఆయనను వెళ్లిపోవాలని.. పదవీ విరమణ చేయాలని కోరాము. వచ్చే ఏడాది ఇది జరుగుతుందని ముందే ఊహించాము.' అని షామన్ అణా మారియా సిమియన్ తెలిపారు. అయితే, వారి అంచనా పాక్షికంగానే నిజమైంది. వాస్తవానికి వారు మదురో పతనాన్ని మాత్రమే ఊహించారట. ట్రంప్ ఆయన్ను పదవి నుంచి తొలగించినప్పటికీ.. మదురో వారికి చిక్కకుండా పారిపోతాడని భావించారట. కానీ, మదురోను యూఎస్ భద్రతా బలగాలు బందీగా తీసుకున్నాయి. 'నికోలస్ మదురో పతనాన్ని మేము చూస్తాము. వెనెజువెలా నుంచి ఆయన పారిపోతారు. అమెరికాకు పట్టుబడరు.' అని షామన్ జువాన్ డి డియోస్ గార్సియా డిసెంబర్ 29న ప్రకటించారు. కానీ.. మదురోను, ఆయన భార్యను యూఎస్ భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. శనివారం నాడు వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని సైనిక స్థావరంపై దాడి చేసిన అమెరికన్ భద్రతా బలగాలు.. అక్కడ ఉన్న మదురో ఆయన భార్య సిలియా ఎ÷-లోర్స్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దంపతులిద్దరిపై నార్కో టెర్రరిజం కుట్రలో పాల్గొన్నారనే అభియోగాలు మోపింది ట్రంప్ ప్రభుత్వం. అయితే, యూఎస్ చర్య యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఈ చర్యను పలు దేశాలు సమర్థిస్తుండగా.. మరికొన్ని దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. సామ్రాజ్యవాద చర్యగా అభివర్ణిస్తున్నాయి. యూఎస్-వెనెజువెలా ఇష్యూనే కాదు.. ఉక్రెయిన్-రష్యా వార్ గురించి కూడా షామన్లు ప్రిడిక్షన్ చెప్పారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కూడా ముగిసిపోతుందన్నారు. ఇరు దేశాలు శాంతి జెండాను ఎగురవేస్తాయని షామన్ గార్సియా చెప్పారు. షామన్లు ప్రిడిక్షన్ ప్రతి ఏటా డిసెంబర్ చివరిలో నిర్వహిస్తారు. షామన్లు చెప్పే వార్షిక ప్రిడిక్షన్స్‌లో కొన్ని నిజమవడం, మరికొన్ని కాకుండా ఉన్నాయి. వాస్తవానికి 2023లోనే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగిసిపోతుందని షామన్లు అంచనా వేశారు. కానీ, అది జరగలేదు. మానవ హక్కుల ఉల్లంఘనకు జైలు శిక్షణ అనుభవించిన పెరివియన్ మాజీ అధ్యక్షుడు ఆల్బర్టో ఫుజిమోరి 12 నెలల్లోపు చనిపోతారని షామన్లు అంచనా వేశారు. వారి అంచనా నిజమైంది. ఫుజిమోరి సెప్టెంబర్ 2024లో 86 సంవత్సరాల వయసులో చనిపోయారు. ఇవేకాదు.. భూకంపాలు, వాతావరణ దృగ్విషయాలు వంటి ప్రకృతి వైపరిత్యాలను కూడా షామన్లు ఊహించి చెబుతుంటారు. మొత్తానికి వెనెజువెలా అధ్యక్షుడి విషయంలో వారు చెప్పింది

# అమెరికా మేరీల్యాండ్‌లో తెలుగు యువతి దారుణ హత్య

### మాజీ ప్రియుడు నివాసంలోనే నిఖితా రావు గొడిశాల మృతదేహం

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు..భారత్ ఎంబసీకి సమాచారం

**న్యూఢిల్లీ:** అమెరికాలోని మేరీల్యాండ్‌లో తెలుగు యువతి దారుణ హత్యకు గురైంది. హోవర్డ్ కౌంటీలోని ఎలికాట్ సిటీకి చెందిన తన మాజీ ప్రియుడు అర్జున్ శర్మ నివాసంలోనే నిఖితా రావు గొడిశాల (27) అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించింది. కత్తిపోట్లతో అతని అపార్ట్‌మెంట్‌లో విగతజీవిగా పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. అయితే అంతకుముందే అమె మాజీ బాయ్‌ఫ్రెండ్ దేశం విడిచి పారిపోయాడు. దానికంటే ముందు నిఖిత కనిపించడం లేదని అతనే పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. నిఖిత కనిపించడం లేదని జనవరి 2వ తేదీన అర్జున్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చివరిసారిగా తనను తన అపార్ట్‌మెంట్‌లో డిసెంబర్ 31వ తేదీన సాయంత్రం చూశాడనని వెల్లడించారు. ఈ మేరకు సెర్చ్ వారెంట్ జారీ చేసిన అధికారులు.. అర్జున్ ఉండే అపార్ట్‌మెంట్‌లో జనవరి 3వ తేదీన సోదాలు నిర్వహించారు. అప్పుడే కత్తిపోట్లతో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల తర్వాత నిఖితను అర్జున్ చంపేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో అర్జున్ కోసం ఆరా తీయగా.. జనవరి 2వ తేదీ సాయంత్రమే భారత్‌కు వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అతడే నిఖితను హత్య చేసి దేశం విడిచి పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. అర్జున్ శర్మపై ఫస్ట్ డిగ్రీ, సెకండ్ డిగ్రీ మర్డ్ కేసుల కింద అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు హోవర్డ్ కౌంటీ పోలీసులు తెలిపారు. ఇండియాకు పారిపోయిన అర్జున్‌ను గుర్తించేందుకు ఫెడరల్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిఖిత హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని.. దర్యాప్తు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై భారత దౌత్య కార్యాలయం స్పందించింది. నిఖిత కుటుంబసభ్యులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని.. అవసరమైన అన్ని దౌత్య సహాయాలను అందిస్తామని వెల్లడించింది. స్థానిక అధికారులతో కూడా నిరంతరం ఫాలో అప్‌లో ఉన్నట్లు తెలిపింది. కాగా, నిఖిత కుటుంబ మూలాలు సికింద్రాబాద్‌లో ఉన్న ట్లుగా ఆమె సోషల్ మీడియా ఖాతాల ఆధా రంగా తెలుస్తోంది. కానీ ఆమె భారత్‌లో ఏప్రాంతానికి చెందిన యువతి అన్నది మాత్రం కచ్చితంగా అధికారులు ప్రకటించలేదు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

### వెండి కిలో మరో ఆరువేలు పెరుగుదల

**హైదరాబాద్:** గత నాలుగు, ఐదు రోజులుగా కాస్త స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ దూకుడు పెంచాయి. ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పదకొండు గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 37, 400కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 1,580 రూపాయలు పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 25, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1,450 పెరిగింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1, 37, 550కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1, 26, 100కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. గతం రోజుతో పోల్చుకుంటే కిలోకు ఏకంగా రూ.6 వేలు పెరిగింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2.47 లక్షలకు చేరింది. బంగారం, వెండిలో లాభాల స్వీకరణ జరిగి ధరలు తగ్గొచ్చు అనే అంచనాలు వినిపించిన నేపథ్యంలో ఇలా పెరగడం చాలా మంది నిపుణులకు షాకిస్తోంది.

## కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

**హైదరాబాద్:** కుటుంబ కలహాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. భార్యాభర్త వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ చిన్న తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన లాల్ శేఖర్ (32) తన భార్య అనూషతో కలిసి రెండేళ్లుగా ఐలాపూర్ చిన్న తండాలో దోబీ పని చేసుకుంటూ ఉండేవారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం కూడా భార్యాభర్త మధ్య గొడవ జరిగింది. దీంతో అనూష సమీపంలో ఉండే తల్లిగారింటికి వెళ్లిపోయింది. సోమవారం తన పుట్టింట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త లాల్ శేఖర్ వెళ్లి తలుపు పగలగొట్టి వెళ్లి చూడగా అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. దీంతో తనకు ఏం జరుగుతుందోనని ఆందోళనతో తానుండే ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాల్ శేఖర్, అనూష మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్:** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ముందు పవన్ అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పురుగుల మందు తాగి పవన్ ఆత్మహత్యకు యత్నించాడు. పవన్‌ను గచ్చిబౌలి పోలీసులు కొండాపూర్ హస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండాపూర్ హాస్పిటల్ నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. గచ్చిబౌలి గోపన్ పల్లి లో పవన్ నివాసం ఉంటున్నాడు. చిట్టీ విషయంలో పవన్, అతని స్నేహితుడి మధ్య గొడవ జరిగింది. గొడవ కారణంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు పవన్, అతని స్నేహితుడు వెళ్లారు. ఈ క్రమంలోనే పవన్ ఆత్మహత్యకు యత్నించాడు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జలప్రవేశం చేసిన సముద్ర ప్రతాప్' నౌక

**పనాజీ:** సముద్ర జలాల్లో కాలుష్యాన్ని నియంత్రించే అధునాతన సాంకేతికతతో దేశీయంగా తయారు చేసిన 'సముద్ర ప్రతాప్' నౌకను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జలప్రవేశం చేయించారు. గోవా షిప్‌యార్డులో సోమవారం నాడు ఈ కార్యక్రమం జరిగింది. 114 మీటర్ల హైబ్రిడ్ పొల్యూషన్ కంట్రోల్ నౌకను ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించింది. సముద్ర జలాల్లో కాలుష్యాన్ని, ముఖ్యంగా చమురు వ్యర్థాలను నిర్మూలించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఇందులో ఉంది. ఇందులో 60 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను వినియోగించారు. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధ నౌకను తయారు చేసినట్టు రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా తెలిపారు. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర, పర్యావరణ రక్షణతోపాటు కోస్తా తీరప్రాంతాల్లో పెట్రోలింగ్ సైతం నిర్వహిస్తుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొంటున్న తరుణంలో మెరైన్ బయోడైవర్సిటీని పరిరక్షించడం మన నైతిక బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో తయారు చేసే నౌకల్లో 90 శాతం స్వదేశీ సాంకేతికతను వాడేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

## మంత్రలుతో కలసి బస్సులో సిఎం ప్రయాణం

**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ బస్సులో బస్సులో ప్రయాణించారు. శాసనసభ సమావేశాల అనంతరం అసెంబ్లీ నుంచి బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ వరకు మంత్రులతో కలిసి ఆయన బస్సులో ప్రయాణం చేశారు. ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించిన 'ఫులే' సినిమాను మంత్రులు, సీనియర్ నేతలతో కలిసి సీఎం వీక్షించారు.

## వెనెజువెలాపై అమెరికా బలప్రయోగం


**బీజింగ్:** వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయని అగ్రరాజ్యంపై మండిపడింది. ప్రపంచ పోలీస్ లేదా అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించేందుకు ఏ దేశానికీ అధికారం లేదని పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బల ప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. ఏ దేశమైనా ప్రపంచ పోలీసు పాత్రను పోషించలేదు. అంతర్జాతీయ న్యాయమూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షించాలి.



# కొత్త కథలతో... కోటి ఆశలతో!








యువ కథానాయకుల్లో చాలా మంది వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు. ఒకప్పుడు కథల ఎంపికలో ఉత్తమ అభిరుచి ప్రదర్శించిన ఆ కథానాయకులే ఊహించని విధంగా ఎదురు దెబ్బలు తిన్నారు. వాళ్లంతా ఇప్పుడు విజయమే లక్ష్యంగా కొత్త కథలపై దృష్టి పెట్టారు. ఆ జాబితాలోనే ఉన్న శర్వానంద్ ఈమధ్యే 'నారీ నారీ నడుమ మురారి'తో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మిగిలిన కథానాయకులు కూడా ఆచితూచి అడుగులేస్తూ, విజయంపైనే గురిపెట్టి కథల్ని ఎంపిక చేసుకొంటున్నారు. ఈ క్రమంలోనే పలు కొత్త కలయికలు వెలుగులోకి వస్తున్నాయి. మంచి కథతోనే 'ఆంధ్ర కింగ్ తాలూకా' చేసిన రామ్ పోతినేనికి ఆ సినిమాతో ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు. దాంతో ఆయన కథలపై మరిన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం రామ్ రెండు స్టోరీలపై దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. మిస్టిక్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సినిమా చేయబోతున్నారని ఎప్పట్నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా మరో కొత్త దర్శకుడు చెప్పిన కథకీ పచ్చజెండా ఊపినట్టు సమాచారం. మరి ఆయన రెండు కథల్నీ ఒకేసారి పట్టాలెక్కిస్తారా లేక, ఒక సినిమా తర్వాత మరొకటి చేస్తారా అన్నది చూడాలి. మరో యువ కథానాయకుడు వరుణ్‌తేజ్ విజయాన్ని చూసి చాలా రోజులైంది. ఆయన ప్రస్తుతం 'కొరియన్ కనకరాజు' అనే సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత చేయనున్న సినిమా కోసం పలువురు దర్శకులు వరుణ్‌కి కథలు వినిపించారు. గత కొన్ని రోజులుగా 'కమిటీ కుర్రోళ్ళు' ఫేం యదువంశీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వరుణ్ కోసం ఆయన ఓ కథని సిద్ధం చేశారని, అది నచ్చి నిహారిక సొంత నిర్మాణ సంస్థలోనే తన అన్నతో సినిమా చేయడానికి రంగం సిద్ధం చేశారని సమాచారం.

ప్రేమకథలకి పెట్టింది పేరైన నాగచైతన్య గతేడాది 'తండేల్'తో విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా చేస్తున్నారు. అది పూర్తయ్యాక ఆయన మళ్లీ ఓ ప్రేమకథ కోసం రంగంలోకి దిగనున్నట్టు సమాచారం. 'బెదురులంక' ఫేం క్లాక్స్ చెప్పిన ప్రేమకథకి నాగచైతన్య పచ్చజెండా ఊపారని సమాచారం. ఆయా ప్రాజెక్టులపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

# 'మృత్యుంజయ్' ఈ నెలలోనే ..

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'మృత్యుంజయ్' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీ హుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి సంయుక్తంగా నిర్మించారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తూ గురువారం చిత్రబృందం ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. విజయవంతమైన 'సింగిల్' తర్వాత శ్రీవిష్ణు కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్న చిత్రమిదే. ఆయన సరసన రెబా మోనికా జాన్ కథానాయికగా నటించారు. 'సామజవరగమన' తర్వాత ఆ ఇద్దరూ కలిసి నటించిన చిత్రమిది. ఉత్కంఠ రేకెత్తించే కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ఛాయాగ్రహణం: విద్యాసాగర్, సంగీతం: కాలభైరవ, ప్రొడక్షన్ డిజైన్: మనీషా ఎ.దత్.




# ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో?

అల్లు అర్జున్ – రష్మికలది వెండితెరపై హిట్ జోడీ. ఈ ఇద్దరూ విజయవంతమైన 'పుష్ప' సిరీస్ సినిమాలతో అందర్నీ మెప్పించారు. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి కలిసి తెర పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ బహుభాషా చిత్రం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రష్మిక ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడా పాత్ర చిత్రీకరణ కోసం ఆమె సెట్స్‌లోకి అడుగు పెట్టిందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో రష్మికది ప్రతినాయిక ఛాయలున్న పాత్రగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో ఆమెతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇది సైన్స్ ఫిక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. అల్లు అర్జున్ ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. దీపికా పదుకొణె కథానాయిక. మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు ప్రచారం వినిపిస్తున్నా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఒకరినొకరు అర్థం చేసుకుంటే...!

'శ్రీ చిదంబరం గారు' అందరి హృదయాల్ని హత్తుకునే సినిమాగా ఉంటుందన్నారు హీరో వంశీ తుమ్మల. ఇది ఒకరినొకరు అర్థం చేసుకునే అందమైన ప్రేమకథలా సాగుతుందని తెలిపారు. ఆయన.. సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన ఈ చిత్రాన్ని వినయ్ రత్నం తెరకెక్కించారు. చింతా వినీషా రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి, హీరో ఆనంద్ దేవరకొండ అతిథులుగా విచ్చేశారు. కీరవాణి మాట్లాడుతూ.. "కొత్త వాళ్లంతా కలిసి ఎంతో ఉత్సాహంగా చేసిన చిత్రమిది. ఈ సినిమాలో నేను పాడిన పాటను మా చెల్లెలు సుప్రభాతంలా వింటుండేది. అందుకే నేను దర్శకుడికి ఫోన్ చేయించి, అభినందనలు చెప్పించా" అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ రత్నం, గోపాల కృష్ణారెడ్డి, నిహారిక కొణిదెల తదితరులు పాల్గొన్నారు.






# విజయ్‌కు మద్రాసు హైకోర్టులో చుక్కెదురు

మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్‌ను కొట్టేసింది. 2015–16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

**అందుకే జరిమానా..**

2015–16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927,** PHONE NUMBER 9908293393,040- 45046154